క్లుప్తంగా

పరీక్ష కేంద్రాల పరిశీలన

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో గ్రూప్ ఫోర్ పరీక్ష కేంద్రాలను బుధవారం పరీక్షా కేంద్రాలను అధికారులు పరిశీలించారు. దేవరకద్రలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, వెంకటసాయి ఎడ్యుకేషన్ కేంద్రం , స్విట్స్ కళాశాలలను తనిఖీ చేశారు. సౌకర్యాలపై చర్చించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి కావలసిన ఏర్పాట్లను చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఈఓ సీత్యానాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ

మిడ్జిల్: మంగళిగడ్డ తండా గ్రామ పంచాయతి భవన నిర్మాణం కోసం బుధవారం ఎంపీపీ సుదర్శన్ భూమి పూజ నిర్వహించారు. భవన నిర్మాణంతో సమస్యలు తొలగుతాయన్నారు. సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీబాయి, బాలు, రమేష్, లక్ష్మణ్, మత్రు నాయక్, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థలం కాపాడాలని వినతి

మిడ్జిల్: మండల పరిధిలోని రాణిపేట్ గ్రామంలోని సర్వే నంబర్‌లో 25 లో ఉన్న శ్మశాన వాటిక స్థలాన్ని కొంతమంది ఆక్రమించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు బుధవారం స్థలాన్ని తహసీల్దార్ రాజీవ్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ మేరకు పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో అంజయ్య , శాంతయ్య, బోయవేణు, ఆంజనేయులు, పెంటయ్య తదితరులు ఉన్నారు.

లింబాద్రికి సన్మానం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ ప్రొఫెసర్ లింబాద్రిని బుధవారం హైదరాబాద్‌లో డిగ్రీ కళాశాలల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాష్, పాలమూరు యూనివర్సిటీ ఈసీ సభ్యుడు కె.ఫణిప్రసాద్‌రావు తదితరులు కలిసి సన్మానించారు.

గడ్డి వాములు దగ్ధం

నవాబుపేట: మండల పరిధిలోని రుద్రారంలో గొల్ల మైబుకు చెందిన దాదాపు రూ.70 వేలు విలువ చేసే రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. కాగా మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేసినట్లు రైతు వివరించాడు. ఈ విషయం గ్రామస్తులతో కలిసి వెళ్లి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించానని, అంతలోపే నష్టం జరిగిపోయిందన్నారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అవస్థల్లో 'ఆదర్శం'



వెన్నచేడ్ ఆదర్శ పాఠశాల బాలికల హాస్టల్

- చాలీచాలని హాస్టల్ వసతి
- ఏళ్లు గడుస్తున్న మారని దుస్థితి
- వెన్నచేడ్ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు

గండేడ్: ఆదర్శ పాఠశాలలో హాస్టల్ వసతి సరిగా లేకపోవడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. సదుద్దేశంతో ఏర్పాటు చేసిన ఆదర్శ పాఠశాల్లో వసతులలేమి, సిబ్బంది కొరత, చాలీచాలని సౌకర్యాలు తదితర అంశాలు కలగలిసి విద్యాభివృద్ధికి అవరోధంగా మారుతున్నాయి. ముఖ్యంగా బాలికల విద్యకు ప్రధాన అడ్డంకిగా మారుతున్నాయి. వెన్నాచేడ్ గ్రామంలో 2013లో ఆదర్శ పాఠశాలను అప్పటి హోం మంత్రి సబితా రెడ్డి ప్రారంభించారు. ప్రస్తుతం ఆరు నుంచి ఇంటర్ వరకు తరగతులు ఇక్కడ కొనసాగుతున్నాయి. మొత్తం 652 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 337 బాలికలు, 315 బాలురు ఉన్నారు. కాగా ఇక్కడ హాస్టల్ వసతి సరిగా లేదు. కేవలం బాలికలకు మాత్రమే హాస్టల్ ఉన్నా..అది కూడా 100 మందికి మాత్రమే సరిపడా ఉండడంతో మిగతా వారికి ఇబ్బందులు తప్పడం లేదు. దీనికితోడు పాఠశాలలో అధ్యాపకులు, సిబ్బంది కొరత సైతం తీవ్రంగా వేధిస్తోంది.

హాస్టల్ ఉన్నా ప్రయోజనం సున్నా..

ఈ పాఠశాలలో బాలికల సౌకర్యార్థం వసతిగృహం నిర్మించి 2019లో ప్రారంభించారు. కానీ అందులో కేవలం వందమందికి మాత్రమే వసతి కల్పించడానికి అవకాశం ఉంది. అది కూడా ఇంటర్ వరకు మాత్రమే కావడంతో ఇబ్బందదులు తప్పడం లేదు. ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులు 100 మంది ఉండగా ప్రస్తుతం మొదటి సంవత్సరం విద్యార్థులు కొత్తగా 70 మంది చేరారు. వీరికి సైతం హాస్టల్ వసతి కల్పించాల్సి ఉన్నా అందుకు అవకాశం లేకుండా పోయింది. అతికష్టం మీద 120 మందికి అవకాశం కల్పించారు. హాస్టల్ వసతి ఇంటర్ వారికే అని మార్గదర్శకాలు ఉండగా వారికి కూడా పూర్తిస్థాయి అవకాశం లేకపోవడంతో చాలామంది చేరడానికి వెనుకంజ వేస్తున్నారు. దీనికి తోడు పాఠశాల మారుమూల ప్రాంతంలో ఉండడం వల్ల రావడానికి బాలబాలికలు అష్టకష్టాలు పడుతున్నారు. కొందరు విద్యార్థులు టిఫిన్ కూడా చేయకుండా ఆరు గంటలకే పాఠశాలకు వెళ్లేందుకు సిద్ధపడాల్సి వస్తోందని వాపోతున్నారు. అంతేకాకుండా వెన్నచేడ్ వంటి గ్రామాల నుంచి వచ్చే వారికి బస్సు సౌకర్యం కూడా సరిగా ఉండడం లేదు. కొన్నిసార్లు కాలినడకనే పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటోంది. అదేవిధంగా బాలికల హాస్టల్ పర్యవేక్షణ ప్రశ్నార్థకంగా మారింది, సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. దీంతో తమ పిల్లలకు కనీస భద్రత లేకపోతే ఎలా అని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాలబాలికల సంఖ్యకు తగ్గట్టుగా వేర్వేరుగా హాస్టల్ వసతి కల్పించాలని, ఇతర సౌకర్యాలు సైతం కల్పించాలని కోరుతున్నారు.

హాస్టల్ సౌకర్యం కల్పించాలి



జూలపల్లి పెద్దతండా నుంచి రోజు పాఠశాలకు వస్తున్నా. తండా నుంచి జూలపల్లికి 1 కి.మీ.. అక్కడి నుంచి నంచర్ల మెయిన్ రోడ్డుకు 4 కి.మీ వెళ్లాల్సి ఉంటుంది. పలు సందర్భాల్లో కాలినడకనే రావాల్సి వస్తోంది. పాఠశాల నుంచి ఇంటికి తిరిగి వెళ్లే సమయానికి రాత్రి అవుతోంది. ఒంటరిగా వెళ్లాలంటే భయంగా ఉంది. హాస్టల్ సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది.

– రాధిక, పదోతరగతి, జూలపల్లి పెద్దతండా

రాకపోకలకు ఇబ్బందిగా ఉంది



హన్వాడ మండలం పుల్పోనిపల్లి నుంచి నిత్యం రాకపోకలు సాగిస్తున్నా. నాన్న నిత్యం బండిపై మహమ్మదాబాద్ వరకు డ్రాప్ చేస్తున్నాడు. ఉదయం 7 గంటలకు వెళ్తే తిరిగి వచ్చే సరికి సాయంత్రం 7 అవుతోంది. వెన్నాచేడ్ బస్సు మిస్సయితే పాఠశాలకు వెళ్లడానికి 2.5 కిలోమీటర్లు నడవాల్సిందే. ఆటోలు సరిగా అందుబాటులో ఉండవు. రాకపోకలకు ఇబ్బంది అవుతోంది.

– వర్షిత, ఎనిమిదో తరగతి , పుల్పోనిపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ప్రస్తుతం ఉన్న హాస్టల్ 100 మందికి మాత్రమే సరిపోతుంది. దాని సామర్థ్యం మేరకే భర్తీ చేస్తున్నాం. విద్యార్థులకు ఇబ్బందులు ఉన్న విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సామర్థ్యం పెంపు అనేది ప్రభుత్వం నిర్ణయం మీద ఆధారపడి ఉంది. పెంచుతారా లేదా అనేది మా పరిధిలో లేదు.

– వెంకటయ్య, ఎంఇఓ, గండేడ్

డ్రమ్ సీడర్‌ను వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఏఓ రాజేందర్‌రెడ్డి

అడ్డాకుల: వరిసాగులో రైతులు డ్రమ్ సీడర్‌ను వినియోగిస్తే కూలీల ఖర్చును అధిగమించే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి రాజేందర్‌రెడ్డి అన్నారు. చక్రాపూర్ గ్రామంలో రైతు ప్రకాష్‌రెడ్డి వ్యవసాయ పొలంలో బుధవారం డ్రమ్ సీడర్ ద్వారా నాటు వేయడాన్ని ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీలో అందుబాటులో ఉండే డ్రమ్ సీడర్‌ను రైతులు రోజుకు రూ.250లు పంచాయతీకి చెల్లించి వాడుకోవచ్చని తెలిపారు. సాధారణ సాగులో ఎకరాకు 30 కిలోల విత్తనాలు అవసరమైతే డ్రమ్ సీడర్‌ను వినియోగిస్తే సన్నరకం విత్తనాలు 8 కిలోలు, దొడ్డు రకం విత్తనాలైతే 10–12 కిలోలో మాత్రమే అవసరమవుతాయని అన్నారు. శుద్ధి చేసిన విత్తనాన్ని 24 గంటల పాటు నీటిలో నానబెట్టి కొంత ముక్కు పగిలిన గింజలను తక్కువ నీళ్లు ఉండే బురద పదునులో డ్రమ్ సీడర్ ద్వారా చల్లాలని సూచించారు. 2,3 రోజుల పాటు నీరు పెట్టకుండా నిర్దిష్టమైన అంతరంలో సాళ్లు వస్తాయన్నారు. దీనివల్ల పురుగుల బెడద తగ్గడంతో పాటు అధిక పిలకలు వస్తాయని వివరించారు. సాధారణ సాగు కంటే ముందుగానే పంట కోతకు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు శివలీల, శివ, రైతులు ప్రకాష్‌రెడ్డి, సాయన్న, ప్రతాప్‌రెడ్డి, ఆంజనేయులు, జలంధర్, శ్రీనివాసులు, జగన్నాథ్‌రెడ్డి, బుడ్డన్న తదితరులు ఉన్నారు.

విద్యాభివృద్ధికి తోడ్పాటు అభినందనీయం



నోట్‌పుస్తకాలు అందజేస్తున్న వెంకట్‌రెడ్డి

రాజాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి తోడ్పాటు నందించడం అభినందనీయమని బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి అన్నారు. కల్లేపల్లిలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ జగన్నాథ్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు రూ.25 వేల విలువచేసే నోటుపుస్తకాలు, ఇతర సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విష్ణువర్ధన్‌గౌడ్, ఉపాధ్యాయులు జంగయ్య, జగన్నాథ్ రెడ్డి కుటుంబ సభ్యులు తిరుపతమ్మ, భరత్ కుమార్‌రెడ్డి, శరత్‌కుమార్‌రెడ్డి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌రోడ్డు నిర్మాణానికి కృషి



జెడ్పీవైస్ చైర్మన్‌తో కలిసి రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

జడ్చర్ల: గంగాపూర్ నుంచి బాలానగర్ వరకు ఉన్న రహదారిని డబుల్‌రోడ్డుగా విస్తరించేందుకు కృషి చేస్తున్నామని జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఎంతో చొరవ చూపిస్తున్నారని, అందులో భాగంగానే అధికారులు రోడ్డు ప్రతిపాదనలు తయారు చేసేందుకు పరిశీలించారని తెలిపారు. విస్తరణ పూర్తయితే ఎన్నో గ్రామాలకు సౌకర్యంగా ఉంటుందని వివరించారు. పనులు త్వరలోనే కార్యరూపం దాల్చనున్నట్లు వివరించారు.

కేంద్రపథకాలతోనే అభివృద్ధి

హన్వాడ: కేంద్రప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని గుడ్డిమల్కాపూర్‌లో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించగా వీరబ్రహ్మాచారితో పాటు ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కొండాబుచ్చిరెడ్డి హాజరయ్యారు. కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మండల అధ్యక్షుడు వెంకటయ్య, మండల నాయకులు మహేందర్‌రెడ్డి, రాజు, శ్రీనివాసులు, కర్రెమ్మ, గోపాల్, శ్రీను, కేశవులు, రాములు, చెన్నమ్మ పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

అడ్డాకుల: మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లికి చెందిన కొండన్నపై దాడి చేసిన ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన కొండన్నకు దాయాదులైన ఇద్దరు మహిళలతో ఇంటి వద్ద గొడవ జరిగిందని, కొండన్నను కొట్టిన ఇద్దరు మహిళలపై బుధవారం ఆయన మూసాపేట ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పండుగలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ మహేశ్ తదితరులు

జడ్చర్ల: పండుగలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ మహేశ్ తెలిపారు. బక్రీద్‌ను పురస్కరించుకుని బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రతిఒక్కరూ సోదరభావంతో మెలగాలని సూచించారు. విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. అలాంటి ఘటనలు జరిగితే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. స్థానిక సీఐ రమేశ్‌బాబు, ఎస్ఐలు లెనిన్, ఖాదర్ పాల్గొన్నారు.

బాలానగర్: బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని ఎస్ఐ శ్రీనివాస్ సూచించారు. బుధవారం మండలంలో వివిధ గ్రామాలకు చెందిన ముస్లిం పెద్దలు, తదితరులతో పీస్ కమిటీ ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేశారు. ముందస్తుగా బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రఫీక్, మునీర్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరులో లేజర్ లైటింగ్



బృందావన్‌కాలనీలో సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేసిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తెలంగాణలో పర్యాటక సొబగులను తీర్చిదిద్దేందుకు త్వరలోనే దక్షిణ కొరియాలో పర్యటించనున్నట్ల రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. బుధవారం వార్డు నం.9 పరిధి లోని మర్లు–బృందావన్‌కాలనీలో రూ.58.55 లక్షలతో సీసీరోడ్డు, డ్రెయినేజీ పనులకు, పంచముఖికాలనీలో రూ.18.95 లక్షలతో చేపట్టే సీసీరోడ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్, మిడ్‌మానేరులో అద్భుతమైన లేజర్ లైటింగ్ షో ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో కొందరు రియాల్టర్లు జీపీ లే–అవుట్లు వేసి ప్లాట్లు విక్రయించి రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించకుండా వెళ్లిపోయారన్నారు. ఇప్పుడు ఆ పనులన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వమే చేయాల్సి వస్తోందన్నారు. ఏదిఏమైనా పాలమూరు పట్టణ ప్రజల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అనంతరం మినీ ట్యాంక్‌బండ్ వద్ద కేబుల్ సస్పెన్షన్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. పర్యాటక శాఖ ఎండీ మనోహర్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్లు మూషా నరేందర్, రావుల అనంతరెడ్డి, కిషోర్ కుమార్, డీఈఈ బెంజిమన్, ఏఈ హరికృష్ణ పాల్గొన్నారు.

జాతీయ గణాంక దినోత్సవం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్టాటిస్టీషియన్ పి.సి.మహలనోబిస్ జయంతిని పురస్కరించుకుని బుధవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ గణాంక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపాద గంగాధర్ మాట్లాడుతూ స్టాటిస్టిక్స్ పూర్తి చేసిన వారికి ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన, ఉపన్యాసం, క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. అధ్యాపకులు డా.టి.విజయలక్ష్మి, టి.రాజేశ్వరి, సి.హెచ్.రవళి, కె.రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

గండేడ్: కొండాపూర్‌కి చెందిన గోవు వెంకటేశ్ మంగళవారం రాత్రి బైక్‌పై నుంచి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. కాలు విరిగింది. చికిత్స ని మిత్తం మహబూబ్‌నగర్‌కు తరలించారు. ఈవిషయం పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణ సాయంగా రూ. ఐదువేలు పంపించారు. సర్పంచ్ శ్రీనివాస్ బుధవారం బాధితుడికి అందజేశారు. గోపాల్, చెన్నారెడ్డి, కృష్ణారెడ్డి ఉన్నారు.

రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- పశుసంపదే ప్రధాన ఆదాయ వనరు
- పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



విజయ డెయిరీని ప్రారంభిస్తున్న పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

గండేడ్: గ్రామాల్లో పశుసంపదే ప్రధాన ఆదాయ వనరు అని, దాని ద్వారా గ్రామీణులు ఉపాధి పొంది ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతుందని పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య ఆధ్వర్యంలో రూ.2.81 కోట్లతో రూర్బన్ పథకం కింద ఏర్పాటు చేసిన విజయ డెయిరీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో వ్యవసాయ అనుబంధంగా పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలన్నారు. రైతులు ఎక్కువగా ప్రైవేట్ డెయిరీలను ఆశ్రయించి నష్టాలపాలవుతున్నారని అన్నారు. గ్రామీణ రైతులకు మేలు చేకూర్చాలనే ఉద్దేశంతోనే మండల కేంద్రంలో దీన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులకు ముద్ర లోన్ల ద్వారా రుణ సౌకర్యం కూడా కల్పిస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల అభ్యున్నతికే పెద్దపీట వేస్తుందని అన్నారు. అనంతరం జంగంరెడ్డిపల్లిలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు బ్యాగులు పంపిణీ చేశారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన పాఠశాల వంట మనిషి కుటుంబానికి రూ.2 లక్షల చెక్కు అందజేశారు. పెద్దవార్వాల్‌లో విద్యుదాఘాతంతో మృతిచెందిన బొక్కరాములుకు రూ.5 లక్షల చెక్కు అందజేశారు. అనంతరం గండేడ్ నుంచి చెన్నయ్యపల్లికి గాను రూ.87 లక్షలతో నిర్మిస్తున్న బ్రిడ్జిని పరిశీలించారు. మండల కేంద్రంలో డీసీఎంఎస్ ఎరువుల దుకాణాన్ని పరిశీలించారు. విజయ డెయిరీ చైర్మన్ సోమభరత్, ఆదాత్‌సిన్హా, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్, కలెక్టర్ రవినాయక్, డీఆర్‌డీఓ యాదయ్య, జిల్లా వెటర్నరీ అధికారి మధుసూదన్, కవిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా వద్ద ఏర్పాట్లు పూర్తి

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈద్గాను బక్రీద్ పండుగ ప్రార్థనల కోసం ముస్తాబు చేశారు. బుధవారం ఈద్గా వద్ద పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. పిచ్చి మొక్కలను గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఆవరణ అంతా చదును చేశారు.


ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మహమ్మదాబాద్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే గండేడ్ మండల పరిధిలోని సల్కార్‌పేట్ గ్రామానికి చెందిన ఆంజనేయులు రంగారెడ్డిపల్లి వాగు నుంచి ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నాడు. దీంతో కొందరు 100 డయల్ చేసి సమాచారం అందించారు. వెంటనే బ్లూకోర్టు పోలీసులు అక్కడికి చేరుకొని రంగారెడ్డిపల్లి నుంచి గండేడ్ వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ

జడ్చర్ల: ఓ ప్రైవేట్ పాఠశాలలో ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన గొడవ ఇరువర్గాల ఘర్షణకు దారి తీసింది. దీంతో ఓ వర్గం వారు మరో వర్గం విద్యార్థులపై దాడి చేయగా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బాదేపల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మొదటగా ఇద్దరు విద్యార్థులు గొడవ పడ్డారు. అందులో ఓ విద్యార్థికి మద్దతుగా కొందరు యువకులు మరో విద్యార్థితో రైల్వేస్టేషన్ సమీపంలో గొడవ పడ్డారు. ఈ క్రమంలో పాతబజార్‌కు చెందిన బీటెక్ విద్యార్థి శివప్రసాద్ గొడవలో తలదూర్చి శాంతపరిచే ప్రయత్నం చేశాడు. దీంతో తమకు అడ్డు వస్తావా అంటూ శివప్రసాద్‌పై సదరు యువకులు చేశారు. దీంతో అతడు తన సోదరులకు ఫోన్ చేసి పిలిపించాడు. దీంతో పాతబజార్‌కు చెందిన డిగ్రీ విద్యార్థి నర్సింహ, 10, 9 వతరగతులకు చెందిన ఇద్దరు అక్కడికి వెళ్లారు. దీంతో వారిపై కూడా సదరు యువకులు దాడి చేశారు. ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం దగ్గరే ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే మారణాయుధాలతో దాడులు చేసినట్లు బాధిత విద్యార్థి తండ్రి తెలిపారు. దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మరికొందరితో కలిసి పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. ఈ లోగా ఓ ప్రైవేట్‌కళాశాల వద్ద మరొకరిపై దాడి చేస్తున్నారన్న సమాచారం రావడంతో పోలీసులు హుటాహుటిన అక్కడికి తరలి వెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ లెనిన్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆస్పత్రిలో విద్యార్థులను విచారించారు. పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామని సీఐ రమేశ్‌బాబు తెలిపారు. ఇటీవల ఇలాంటి ఘర్షణలు వరుసగా చోటు చేసుకుంటుండడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక సంస్కరణల ఆద్యుడు పీవీ



జిల్లాకేంద్రంలో నివాళులర్పిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దేశంలో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ఘనత మాజీ ప్రధానమంత్రి పీవీ నర్సింహారావుకే దక్కుతుందని డీసీసీ ప్రచార కార్యదర్శి సీజే బెన్‌హర్ అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీవీ నర్సింహారావు జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు సుభాష్‌ఖత్రి, అనంతయ్య, జగదీష్, అలీ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు: సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో కార్యాలయంలో బుధవారం జయంతి నిర్వహించారు. ఆర్టీసీ, ఈపీఎస్ పెన్షనర్ల విశ్రాంత ఉద్యోగుల సమితి అధ్యక్షుడు రాజసింహుడు, చంద్రశేఖర్‌రావు, అబ్దుల్ కరీం, నారాయణ, సతీష్, నాగభూషణం పాల్గొన్నారు.